నెరవేరిన పేదల సొంతింటి కల

- తాడిపత్రిలో నేడు టిడ్కో ఇళ్ల అప్పగింత
- మొదటి విడతలో 384 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



తాడిపత్రిలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన టిడ్కో ఇళ్లు

తాడిపత్రి టౌన్: పేదల సొంతింటి కల నెరవేరింది. ఇళ్ల పేరు చెప్పి ప్రజలను టీడీపీ నాయకులు మోసగించినా వైఎస్ జగన్ ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం టిడ్కో ఇళ్లను పూర్తి చేసింది. ఈమేరకు వాటిని లబ్ధిదారులకు మొదటి విడత కింద గురువారం అప్పగించనున్నారు. వివరాల్లోకెళితే.. 2018లో టీడీపీ ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో గన్నెవారిపల్లి కాలనీలో సమీపంలో టిడ్కో ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా లబ్ధిదారుల నుంచి వారి వాటా సొమ్ము కూడా వసూలు చేసింది. ఇంటి నిర్మాణాలు పునాది దశలోనే వదిలేసింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం

ప్రజా సంకల్పయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి 300 చదరపు అడుగుల కేటగిరీలో బ్యాంకు లింకేజీ కింద రూ.2.65 లక్షలు ఇచ్చేలా టీడీపీ ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే జగన్ ప్రభుత్వం ఈ కేటగిరీ కింద ఉన్న 384 ఇళ్లను పూర్తిగా ఉచితంగా ఇవ్వనుంది. ఇక మిగిలిన రెండు కేటగిరీలో ఉన్న లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించింది. తాడిపత్రి మున్సిపాలిటీలోని 1,024 మందికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.77.32 కోట్లు వెచ్చించింది. ఇందులో భాగంగా తొలి విడత కింద 384 మందికి ఇళ్లను అప్పగించనున్నారు.

సొంతింటి కల నెరవేరింది



మేము గానుగ వీధిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాం. నెలకు రూ.2,500 ఇంటి అద్దె చెల్లిస్తున్నాం. కుల వృత్తితో జీవిస్తున్నాం. ఆదాయం అంతంత మాత్రమే వచ్చే మాకు ఇంటి అద్దె భారంగా మారింది. మాకు ఇద్దరు పిల్లలు. వారిని ప్రభుత్వ పాఠశాలలో చదవిస్తున్నాం. జగనన్న వచ్చాక అమ్మఒడితో పాటు సొంతింటి కల నేరవేరింది. చాలా సంతోషంగా ఉన్నాం. –శివపార్వతి, లబ్ధిదారురాలు

ఆనందంగా ఉంది



నా భర్త బాబు నాయక్ 13 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. సీపీఐ కాలనీలో నా కూతురు భవాని, ఆమె భర్త వెంకటేష్‌తో కలిసి అద్దె ఇంటిలో నివాసం వుంటున్నాం. చిన్నపాటి పనులు చేస్తూ జీవనం చేస్తున్నాం. సొంతింటి కల నేరవేరదనుకున్నాం. వృద్ధాప్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నా కలనేరవేర్చాడు. ఆయనకు మా కుటుంబం రుణపడి ఉంటుంది. –గౌరీబాయి

అండగా ఉంటాం.. ఆశీర్వదించండి



అభివృద్ధి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: ప్రజలకు ఎలాంటి కష్టాలొచ్చినా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలను కోరారు. బుధవారం పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా ముస్లింలు, ఆర్యవైశ్యులు, వ్యాపారులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో తాడిపత్రి ప్రజల ప్రశాంత జీవనానికి భంగం వాటిల్లిన సందర్భాలు ఒక్కటీ లేవన్నారు. ఊరంతా ప్రశాంతంగా ఉందని ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పోలీసులు అధికారులకు సూచనలు ఇస్తున్నామన్నారు. వ్యాపారులు తమ వ్యాపారాలు స్వేచ్ఛగా నిర్వహించుకోవచ్చని సూచించారు. గతంలో వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేసేవారని, కాని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటికి చెక్ పెట్టామన్నారు. తమకు అధికారం కట్టబెట్టిన ఊరి కోసం ఏంచేసేందుకైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాడిపత్రి ప్రజల రుణం ఎన్నటికీ తీర్చుకోలేమన్నారు. కౌన్సిలర్లు ఆతీఫా, షాకీరా, ఫైజున్, రాఘవేంద్ర ప్రసాద్, అంబటి రాఘవ,జాకీర్, షబ్బీర్, అయూబ్, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆదరించండి



పెరవలి ఎస్సీ కాలనీలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు

- నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆదరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని పెరవలి, జూలాకాల్వ, జలాలపురం, కొరివిపల్లి, సోదనపల్లి గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునేందుకు అవకాశాలు కల్పించారన్నారు. ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు చేయడం, నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లగా మార్చారని పేర్కొన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో చేయని విధంగా విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.పేదల కోసం కృషి చేస్తున్న జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామన్నారు. ఈనెల 18న రాప్తాడులో జరిగే సిద్ధం సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకులు శ్రీనివాసులు బాబు నాయక్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు పురస్కారాలు



ఉత్తమ అవార్డు అందుకుంటున్న డ్రైవర్లు కె.రాజు

గుత్తి డిపో



ఈరన్న



ఉస్మాన్

గుంతకల్లు డిపో



బి.బాలస్వామి



వై.కె.మూర్తి



హెచ్.కె.పీరా

తాడిపత్రి డిపో



బి.శంకర్



ఎం.ప్రసాద్

అనంతపురం క్రైం: మూడు దశాబ్దాలకు పైగా డ్రైవింగ్ వృత్తిలో రాణిస్తూ ఎలాంటి ప్రమాదాలకు కారకులు కాని పలువురు ఆర్టీసీ డ్రైవర్లు ఉత్తమ పురస్కారాలను అందుకున్నారు. అనంతపురంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో వీరికి అవార్డులను జిల్లా అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి, ఆర్టీఓ సురేష్‌నాయుడు, జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని తదితరులు అందజేశారు.

ఘనంగా ఆలూరు పుట్టిన రోజు వేడుకలు



బీకేఎస్‌లో కేక్ కట్ చేస్తున్న సమన్వయకర్త వీరాంజనేయులు, నాయకులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి అభివృద్ధిపై ప్రత్యేక ముద్ర వేసుకున్నారన్నారు. తామంతా వీరి అడుగు జాడల్లో జీవితాంతం నడుస్తామన్నారు. అనంతరం బీకేఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఆర్డీటీ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, మండల కన్వీనర్ అంకే నరేష్, సీనియర్ నాయకులు ఆలూరి రమణారెడ్డి, ఎస్టీ సెల్ కన్వీనర్ సాకే లక్ష్మీనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, చికెన్ నారాయణస్వామి, చంద్ర మోహన్, రాజారెడ్డి, కొండన్న, కుళ్లాయప్ప, పురుషోత్తం, సాయి, శివ పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్.జగన్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని 15వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ సామాజిక విప్లవానికి తెరతీశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నారన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై ఎంతైనా ఉందన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అవసరం



చిన్నారులకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

పామిడి: విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య అవసరమని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, సీనియర్ నాయకులు సునీల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సరస్వతీ విద్యామందిరంలో ఆన్యువల్ స్పోర్ట్‌మీట్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. స్కూల్ కమిటీ సభ్యులు బీవీ రత్నమయ్య, చౌడయ్య, హెచ్‌ఎం మయూరి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని 4వ వార్డు సచివాలయంలో బుధవారం రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూరబీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి జగనన్న సురక్షా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరంలాంటిదన్నారు. వైద్యులు బిందు భార్గవి, విష్ణుమూర్తి రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గార్లదిన్నె: మండల పరిధిలోని మర్తాడు, కోటంక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ లోకేశ్వరీ పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. మండల వ్యాప్తంగా 50 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

మద్యం పట్టివేత

శింగనమల: శింగనమల ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని దుకాణాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న హరికృష్ణ, లక్ష్మీనారాయణను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. వారి నుంచి 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంజేపీ స్కూల్‌లో సరస్వతి పూజ



పూజల్లో పాల్గొన్న విద్యార్థినులు

శింగనమల: ఈస్ట్ నరసాపురం ఎంజేపీ పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థినులు సరస్వతి పూజను నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంగీతకుమారి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. పేరెంట్స్ కమిటీ సభ్యుడు నరసింహులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంటలు నమోదు చేస్తే ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంట నష్టపరిహారం ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. రైతులు గ్రామాల్లో ఆర్బీకే సిబ్బందిని కలిసి వెంటనే ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. అలాగే ఈకేవైసీ చేయించుకుంటే పీఎం కిసాన్ యోజన పథకం వర్తిస్తుందన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి

గార్లదిన్నె: వాహనదారులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం గార్లదిన్నె డ్యాం రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని వారికి అపరాధ రుసుం విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు కచ్చితంగా ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అతివేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు.

70 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు

శింగనమల: మండలంలోని పలు గ్రామాల నుంచి 70 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి పంపినట్లు తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శంకర్‌నాయక్, ఆప్తాల్మిక్ అసిసెంట్ ప్రసాద్ తెలిపారు. బుధవారం వారికి కంటి పరీక్షలు నిర్వహించి, కంటి అపరేషన్లు అవసరమైన వారందరినీ ఉచితంగా బస్సులో పంపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అవసరమైన వారికీ అపరేషన్లు చేయిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అశ్వర్థ, సచివాలయం సీహెచ్‌ఓ దివ్యభారతి, ఏఎన్‌ఎం శైలజా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాశినాయన విగ్రహ ప్రతిష్ట



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్ర సమీపంలో పెన్నానది ఒడ్డున నూతనంగా నిర్మించిన కాశిరెడ్డిన ఆలయంలో బుధవారం వేదపండితులు కాశినాయన విగ్రహాన్ని ప్రతిష్టించారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకస్వాములు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాశినాయన ఆశ్రమం అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కడపజిల్లాకు చెందిన చిన్నారుల కోలాటం ఆహూతులను ఆకట్టుకుంది. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

అమర జవాన్లకు ఘన నివాళి



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు: దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమర వీరుల త్యాగాలు మరవలేనివని వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో ఫిబ్రవరి 14న పుల్వామా ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలర్పించిన 40 మంది అమర జవాన్లను స్మరించుకుంటూ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ వారి చిత్రపటాల వద్ద కొవ్వొత్తులను వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ రక్షణకు వీర సైనికుల శౌర్యమే స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ప్రకాష్, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి కృష్ణయ్య, అధ్యాపకులు డి.వెంకటేశ్వర్లు, నటరాజ్, రాకేష్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో ప్రతిభ



రిషిత రవిత్రయిని



హరిత

గుత్తి: జాతీయ ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్–2024 ఫలితాల్లో గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లికి చెందిన రాధిక, రవి దంపతుల కుమార్తె రిషిత రవిత్రయిని సత్తా చాటారు. 99.11 శాతం స్కోర్ సాధించి ప్రతిభ చూపారు. ఆమె రాయచోటిలోని వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎం బైపీసీ చదువుతోంది. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన నీలి హరిత అనే విద్యార్థిని జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటింది. గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి, నారాయణమ్మ దంపతుల కుమార్తె హరిత విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతోంది. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 98.75 శాతం స్కోర్ చేసింది.

ఘనంగా 'భస్మ బుధవారం'

పామిడి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చ్‌లో బుధవారం రాత్రి భస్మ బుధవార ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. భస్మ బుధవారం నుంచి గుడ్‌ఫ్రైడే వరకూ క్రీస్తు శ్రమల దినాలుగా క్రైస్తవులు పాటిస్తారన్నారు. కార్యక్రమంలో వీరయ్య, జకరయ్య, జయరాజు, అబ్రహాం, రత్నరాజు, ప్రసాద్, రజని, మంజుల, ప్రిస్కిల్లా, సుశీలమ్మ, రేచెల్ పాల్గొన్నారు.

రైల్వే పోలీసుల తనిఖీలు



ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసు

తాడిపత్రి అర్బన్/ గుత్తి : తాడిపత్రి, గుత్తి రైల్వే స్టేషన్లో జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప ఆధ్వర్యంలో బుధవారం మంగళవారం అర్ధరాత్రి తనిఖీ చేపట్టారు. గుంతకల్లు నుంచి గుత్తి మీదుగా వచ్చే రైళ్లను తనిఖీ చేయడంతో పాటు అనుమానితుల లగేజీ బ్యాగుల్లో సోదాలు నిర్వహించారు. మత్తు పదార్థాలు, మద్యం, నగదు రవాణాను అరికట్టేందుకే తనిఖీలు చేపట్టినట్లు రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ తెలిపారు.

తాడిపత్రి అర్బన్: ఎన్నికల నేపథ్యంలో బుధవారం సాయంత్రం పట్టణంలోని లాడ్జీలు, ధాబాల్లో అర్బన్ సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ షేక్ గౌస్‌బాషా విస్తృత తనిఖీలు చేపట్టారు. లాడ్జిలో బస చేసే వారి వివరాలను, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ లాడ్జిల్లో బస చేసే వారి వద్ద సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని, అందరి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వొద్దన్నారు. అనుమానితుల వివరాలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ధాబాల్లో మద్యం తాగేందుకు అనుమతించొద్దన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



డైవాలమడుగు చెక్‌పోస్టు వద్ద పోలీసులకు భద్రతపై సూచనలిస్తున్న డీఎస్పీ గంగయ్య

యాడికి: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అనంతపురం జిల్లా సరిహద్దులో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య ఆదేశించారు. యాడికి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల వివరాలను సీఐ నాగార్జునరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు సరిహద్దుగా ఉన్న డైవాలమడుగు, కుందనకోట, కోనుప్పలపాడు గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగదు, మద్యం కర్నూలు జిల్లా నుంచి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఐకి సూచించారు.

హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు: అశ్వత్థంలో మాఘమాసం తొలి ఆదివారం సందర్భంగా భక్తులు హుండీల్లో వేసిన కానుకలను బుధవారం లెక్కించారు. తాత్కాలిక హుండీల నుంచి రూ.3,31,115లు,శాశ్వత హుండీల ద్వారా 1,82,870 ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. గత పదేళ్లలో తాత్కాలిక హుండీల ద్వారా రెండు రోజుల వ్యవధిలో ఇంతటి మొత్తం ఆదాయం రావడం ఇదే ప్రథమమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి

పామిడి: పట్టణ భోగేశ్వరాలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సరస్వతీమాత జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో పండితులు చంద్ర, అనిల్ తదితరులు సరస్వతీమాత విగ్రహానికి మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాలల్లో అక్షరాభ్యాసం

పట్టణంలోని నిట్టూరు నిలయం, సరస్వతి ప్రాథమిక విద్యామందిరం పాఠశాలల్లో బుధవారం చిన్నారుల అక్షర భ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సరస్వతీమాత జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయా పాఠశాలల్లో వేదపండితుల యజ్ఞ మంత్రోచ్ఛరణల నడుమ చిన్నారులకు అక్షర భ్యాసం చేయించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాసన్, తులసీబాయి, మయూరి, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం పనితీరుపై అవగాహన



ఈవీఎం పని విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యాడికి: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయం, కుంట, కోమటిబజార్, కోన రోడ్, ఆసుపత్రి కాలనీలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం), వీవీ ప్యాట్‌ల పనితీరుపై ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, డీటీ బాలమ్మ, ఎంఈఓ కాశెప్ప ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవీఎం ఎలా పని చేస్తుంది, ఓటు ఎలా వేయాలో ఓటర్లకు వివరించారు. 80 ఏళ్లు పైబడిన, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

గుంతకల్లు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. బుధవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై సెక్టార్ ఆఫీసర్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీవీ ప్యాడ్, బ్యాలెట్ పేపర్, ఈవీఎం మిషన్ కంట్రోల్ యూనిట్ తదితర అంశాలపై సెక్టార్ ఆఫీసర్స్‌కు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు రూరల్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీఎన్‌జీఓ అసోషియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. గుంతకల్లు యూనిట్ అధ్యక్షురాలు సంపూర్ణ ఎస్తేర్, సెక్రెటరీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఏపీ జేఏసీ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.